సాక్షి ఒడిశా

ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,94,488లు, బంగారం 2 గ్రాము 590 మిల్లీగ్రాము, వెండి 8 గ్రాముల 100 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



15 ప్రతిపాదనలకు ఆమోదం

మంత్రివర్గం 15 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఇందులో నదుల ప్రాజెక్టులు ఉన్నాయి.

- 8లో



గంజాయి స్వాధీనం

గుడారిలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 177 కిలోల గంజాయి దొరికింది.

- 8లో

న్యూస్‌రీల్

పేదలకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

రాయగడ: స్థానిక లయన్స్ క్లబ్ అపరాజిత మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం సదరు సమితి కొత్తపేట కమ్యూనిటీ హాల్‌లో పేదలకు దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కొత్తపేట పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన నిరుపేదలకు 80 చీరలు, 70 తువ్వాల్లు, 70 దోవతీలను పంపిణీ చేశారు. అదేవిధంగా కార్యక్రమానికి హాజరైన వారికి ఉచితంగా భోజన సౌకర్యం కల్పించారు. లయన్స్ క్లబ్ అపరాజిత మహిళా విభాగం కొద్ది నెలలుగా ఇటువంటి తరహా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని.. ఇందులో భాగంగా పేదలకు దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని దీపావళి సందర్భంగా నిర్వహించామని క్లబ్ కార్యదర్శి బరాటం అవంతి తెలియజేశారు. కార్యక్రమంలో క్లబ్ మిడియేట్ పూర్వ జిల్లా గవర్నర్ సరస్వతి పాత్రో, అధ్యక్షులు జి.రామక్రిష్ణ, ఉపాధ్యాక్షురాలు రజిత కోరాడ, ఉపాధ్యక్షురాలు కింతలి శ్రీవాస్తవ, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నాగావళి నదిలో వృద్ధుడు గల్లంతు



పెంటయ్య జీలకర్ర (ఫైల్)

రాయగడ: మల్లిగాం సమీపంలోని నాగావళి నదిలో మరో వృద్ధుడు గల్లంతయ్యాడు. సదరు సమితి మల్లిగాం గ్రామానికి చెందిన పెంటయ్య జిలకర్ర (70) అనే వృద్ధుడు శుక్రవారం సాయంత్రం పశువులను పచ్చిక మేపేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో కొన్ని పశువులు నది మధ్యకు వెళ్లడంతో వాటిని గట్టుమీదకు తీసుకొచ్చే ప్రయత్నం చేసేందుకు నదిలోనికి దిగాడు. అయితే నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కొట్టుకుపోయాడు. స్థానికులు గమనించి అగ్ని మాపక కేంద్రం సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది శుక్రవారం రాత్రి వరకు గాలించినప్పటికీ ఆచూకీ లేకపోవడంతో శనివారం కూడా గాలించారు. గత పది రోజుల్లో నాగవళి నదిలో పది మంది వరకు మృత్యువాతకు గురయ్యారు.


రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ద్విచక్ర వాహనాలు

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఘటనలో గాయాలు పాలైన వారిలో జింజిలిబడి గ్రామానికి చెందిన శంభు, రామచంద్ర హుయికలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని జింజిలిబడి గ్రామం నుంచి శంభు అనే యువకుడు తన గ్రామం నుంచి వ్యక్తిగత పనిపై జేకేపూర్‌కు బైక్‌పై వెళ్తున్న సమయంలో పెట్రోల్‌బంక్ సమీపంలో ఎదురుగా మరో బైక్‌పై వస్తున్న అదే గ్రామానికి చెందిన రామచంద్రహుయిక అనే వ్యక్తి ఎదురెదురుగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. రెండు బైకులు ముందు భాగాలు నుజ్జునుజ్జవ్వగా బైకు చోదకులు తీవ్రగాయాలకు గురయ్యారు. అక్కడగల వారు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన చందిలి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



బహుమతులు సాధించిన విద్యార్థినులు

పర్లాకిమిడి: స్థానిక మహేంద్రగిరి పురపాలక ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి సైన్సు సెమినార్‌లో భాగంగా 'క్వాంటం యుగం ప్రారంభం' అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు శనివారం నిర్వహించారు. దీనివల్ల మనం ఎలాంటి సవాళ్లు ఎదుర్కోగలమో పలువురు విద్యార్థులు వివరించారు. న్యాయ నిర్ణేతలుగా జాతీయ అవార్డు గ్రహీత బినోద్ చంద్ర జెన్నా, సాత్విక్ పట్నాయిక్‌లు వ్యవహరించగా, ముఖ్య అతిథిగా జిల్లా సైన్సు కో–ఆర్డినేటర్ అంపోలు రవికుమార్, హెచ్ఎం పూర్ణచంద్ర ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

లెవెల్ క్రాసింగ్ గేటు.. దాటితే చేటు

- ప్రమాదకరంగా గేట్లు దాటుతున్న వైనం
- ప్రమాదాల నివారణకు అధికారుల చర్యలు



నిబంధనలు అతిక్రమించి వేసి ఉన్న గేటు కింద నుంచి వెళ్తున్న ప్రయాణికుడు



ప్రమాదకరంగా ట్రాక్ దాటుతున్న వృద్ధుడు

భువనేశ్వర్:

రహదారి, రైలు మార్గం కూడలిలో లెవెల్ క్రాసింగ్ గేట్లు ప్రజల ప్రాణాలకు భద్రతగా నిలుస్తున్నాయి. ప్రాణాపాయ పరిస్థితులు నివారించి రైళ్లను సకాలంలో నడిపించే లక్ష్యంతో రైల్వే శాఖ ఈ గేట్లు నిర్వహిస్తోంది. అక్కడక్కడా ఈ గేట్లను ప్రమాదకరంగా దాటుతూ చాలా మంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇలాంటి చర్యలు రైల్వే చట్టం ప్రకారం నేరంగా పరిగణిస్తారు. ఈ అవాంఛనీయ సంఘటనల నివారణలో రోడ్డు వినియోగదారులు సహకరించాలని ఖుర్దారోడ్ రైలు మండలం అభ్యర్థిస్తోంది. గేటు మూసివేసేటప్పుడు రోడ్డు వినియోగదారులు బలవంతంగా లెవెల్ క్రాసింగ్ గేట్లను దాటడానికి ప్రయత్నించడం చట్ట వ్యతిరేక చర్య. బలవంతంగా లెవెల్ క్రాసింగ్ గేట్లు దాటే సందర్భాల్లో గేట్ల భద్రతా భాగాలు దెబ్బతింటున్నాయి. రైలు సిగ్నల్ వైఫల్యాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ బాధ్యతారహిత ప్రవర్తన ఫలితంగా రైళ్ల సమయపాలన కోల్పోవడం, రైలు కార్యకలాపాలకు అంతరాయం, ప్రాణాలకు మరియు ఆస్తికి ప్రమాదం ఏర్పడుతోంది. గత ఏడాది తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ మండలంలో సమగ్రంగా 113 లెవెల్ క్రాసింగ్ గేటు ఉల్లంఘన సంఘటనలు నమోదయ్యాయి. ఈ నేరం కింద 92 మంది నిందితుల్ని అరెస్టు చేశారు. ఈ ఏడాది అక్టోబర్ 8 వరకు ఖుర్దా రోడ్ మండలంలో 64 లెవెల్ క్రాసింగ్ గేట్ అక్రమ ఉల్లంఘన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఆయా సంఘటనలో ఇప్పటి వరకు 47 మంది నిందితుల్ని అరెస్టు చేశారు.

ఖుర్దారోడ్ మండలంలో ఉల్లంఘనలు

ఖుర్దారోడ్ మండలంలో పలు చోట్ల లెవెల్ క్రాసింగ్ గేట్లు వేసి ఉండగా అతిక్రమించడం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది పలు ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. భువనేశ్వర్ ప్రాంతంలో ఇటువంటి 11 సంఘటనలు సంభవించగా బరంపురం ప్రాంతంలో 8, పూరీ, భద్రక్, జాజ్‌పూర్ కెంజొహర్ రోడ్ ప్రాంతాల్లో 7 చొప్పున లెవెల్ క్రాసింగు గేటుల నిబంధనల ఉల్లంఘన కేసులు నమోదయ్యాయి. కటక్ ప్రాంతంలో 6, పలాస, ఖుర్దా రోడ్ ప్రాంతాలలో 5 వంతున ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి.

అవగాహన కసరత్తు

లెవెల్ క్రాసింగ్ గేట్ల అక్రమ ఉల్లంఘన నివారణకు ఖుర్దా రోడ్ రైల్వే మండలం భద్రతా విభాగం, రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) సంయుక్తంగా తరచూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధికార వర్గాల సమాచారం. ఈ దిశలో సాధారణ ప్రజానీకం స్వచ్ఛందంగా సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

గేటు అతిక్రమణ అపాయం

రైళ్లు, రోడ్డు వాహనాలు సురక్షితంగా, సజావుగా ప్రయాణించడానికి ప్రజల మద్దతు చాలా అవసరం. పట్టాలపై అధిక వేగంతో దూసుకువస్తున్న రైలుని అకస్మాత్తుగా ఆపే అవకాశం ఉండదు. పరుగులు తీస్తున్న రైలుని అత్యవసరంగా నియంత్రించేందుకు బ్రేక్‌లు వేసిన వెంటనే ఆగకుండా కొంత దూరం పోయిన తర్వాత ఆధీనంలోకి వస్తుంది. ఈ స్వల్ప నిడివిలో ప్రాణాపాయ పరిస్థితులు నెలకొంటాయి. మూసి ఉన్న లెవెల్ క్రాసింగ్ గేట్‌ను దాటడానికి చేసే ఏ ప్రయత్నమైనా విపత్తుకు ఆహ్వానం పలికినట్లేనని అధికార వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఇలాంటి నిర్లక్ష్య చర్యలు ఉల్లంఘనకు పాల్పడే వారితో రైలు ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలో పడేసి రైల్వే ఆస్తికి అపార నష్టం చేకూర్చుతాయి. రైలు కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగిస్తాయి. ప్రయాణికులు, సరుకు రవాణా రంగాల్లో సమయపాలన విపరీతంగా ప్రభావితమై సుఖమయమైన రైలు ప్రయాణం అసౌకర్యంగా పరిణమిస్తుంది.



లెవెల్ క్రాసింగ్ గేటు ప్రాంగణంలో రద్దీ

భక్తిశ్రద్ధలతో పూజలు



వేంకటేశ్వరునికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక బాలాజీనగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం త్రిరాత్ర పవిత్రోత్సవ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, శాత్తుముర్రై, మంగళశాసన పూజలను నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలో పోలీసులు, ఆర్టీవో సిబ్బంది సంయుక్తంగా వాహన తనిఖీలను శనివారం నిర్వహించారు. నియమాలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకున్నారు. 35 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.3,88,875ల జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అవగాహన కల్పించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



మృతుడు పువ్వల పారయ్య (ఫైల్)



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న నాటు తుపాకులు



పోలీసుల అదుపులో నిందితుడు మంగులు మండంగి

రాయగడ: జిల్లాలోని రామనగుడ సమితి గోగుపాడు పంచాయతీలోని సికల గ్రామ సమీపంలోని ఒండరాబంగ్ కొండపై ఒక యువకుని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న కేసులో సంబంధం ఉన్న నిందితుడుని శుక్రవారం అరెస్టు చేశారు. అరెస్టయిన వ్యక్తి పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం పార్వతీపురం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం ఆదురుబంగి గ్రామానికి చెందిన మంగులు మండంగి (52)గా గుర్తించారు. అతని నుంచి రెండు నాటు తుపాకీలను స్వాధీనం చేసుకుని నిందిడుడిని గుణుపూర్ సబ్ డివిజన్ కోర్టుకు తరలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. ఈ నెల ఏడో తేదీన సికల గ్రామ సమీపంలోని ఒండురుబంగ్ కొండపై మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుని ఆధార్ కార్డును ఆధారంగా మృతుడు పువ్వల పారయ్యగా పోలీసులు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఒండురుబంగ్ గ్రామవాసిగా పోలీసుల దర్యాప్తులో తేలింది. అనంతరం మృతుని కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో వారు రామనగుడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న స్టేషన్ మాస్టర్లు

కొరాపుట్: రైళ్లు సురక్షితంగా నడపడానికి సందేశం ఇచ్చే రైల్వేస్టేషన్ మాస్టర్ల సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా స్టేషన్ మాస్టర్స్ అసోసియేషన్ (ఈస్టుకోస్ట్ జోన్) విజ్ఞప్తి చేసింది. శనివారం కొరాపుట్ జిల్లా కేంద్రంలో ఈస్టుకోస్ట్ రైల్వేస్టేషన్ మాస్టర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ అడ్వైజర్ కమిటీకి చెందిన పీసీ సామల్ (ఖుర్దా) మాట్లాడుతూ.. రైల్వే విభాగంలో స్టేషన్ మాస్టర్ల ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. నైట్ షిఫ్ట్ అలవెన్స్ అందరికీ ఇవ్వాలని, పని గంటల ఒత్తిడి వలన రద్దీ స్టేషన్లలో అదనపు స్టేషన్ మాస్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను డీఆర్ఎం ద్వారా రైల్వే బోర్డుకి పంపాలని నిర్ణయించారు. సమావేశంలో జోనల్ ప్రెసిడెంట్ పీఎస్ మూర్తి (విశాఖపట్నం), సంయుక్త కార్యదర్శి పి.నారాయణరావు (కొరాపుట్) తదితరులు పాల్గొన్నారు.

ధనధాన్య కృషి పథకం ప్రారంభం



వర్చువల్ విధానంలో జరిగిన కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ కులకర్ణి, పక్కనే రైతులు

రాయగడ: లోక్‌నాయక్ స్వర్గీయ జయప్రకాష్ నారాయణ్ జయంతిని పురస్కరించుకుని భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ధనధాన్య కృషి యోజన కార్యక్రమాన్ని వర్చువల్ మాధ్యమంలో శనివారం నాడు ప్రారంభించారు. స్థానిక రాణిగుడ ఫారంలోని బిజుపట్నాయక్ కళ్యాణ మండపంలో ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి ముఖ్యఅతిథిగా హాజరై ఢిల్లీ నుంచి ప్రసారమైన వర్చువల్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ రైతుల సంక్షేమం కోసం ఈ పథకం ప్రారంభించామని వివరించారు. పథకం ముఖ్యఉద్దేశాన్ని మోదీ వర్చువల్ మాధ్యమంలో రైతునుద్దేశించి ప్రసంగించారు. దేశంలో దాదాపు వంద జిల్లాల్లో రైతులు పప్పుదినుసుల పంటలను పండించి ఆర్థికంగా ముందుకు వెళుతున్నారని మోదీ అన్నారు. ఒడిశా రాష్ట్రంలోని నువాపడ, మల్కన్‌గిరి, కంధమాల్, సుందర్‌ఘడ్ జిల్లాల్లో ఇప్పటికే వ్యవసాయం పట్ల రైతులు అవగాహన పొంది ఆర్థిక సారికారితను పొందుతున్నారని అన్నారు. రాయగడ జిల్లాలో కూడా 11 సమితుల్లో 180 మందికి పైగా రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఇదేతరహా పంటలపై ఆసక్తి కనబరచాలని సూచించారు.

ముఖ్యమంత్రిని కలిసిన తిరుపతి పాణిగ్రాహి



ముఖ్యమంత్రిని కలిసిన తిరుపతి పాణిగ్రాహి

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని హైటెక్ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి కలిశారు. ఈ సందర్భంగా హైటెక్ ఉన్నత శ్రేణి ఆస్పత్రుల్లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా సౌలభ్యం కల్పించడంపై ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రితో మర్యాదపూర్వకంగా కలిసిన తిరుపతి పాణిగ్రాహి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా రాష్ట్రంలో ప్రారంభించిన ఆయుష్మాన్ హెల్త్ కార్డ్ ఆరోగ్య సేవల రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికింది. దిగువ, మధ్యతరగతి, పేద మరియు బలహీన వర్గాలకు చికిత్స సులభతరమైంది. ఆయుష్మాన్ హెల్త్ కార్డ్ కారణంగా మణిపూర్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్ తదితర దూరప్రాంతాల నుంచి విచ్చేసిన రోగులకు హైటెక్ ఆస్పత్రిలో ఉన్నత వైద్య, చికిత్స సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు.

పిడుగు పడి పశువులు దుర్మరణం



పిడుగు పడి మరణించిన ఆవు వద్ద విలపిస్తున్న భీమ బొడొనాయిక్ దంపతులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిలో శనివారం పిడుగు పాటుకు మూడు పశువులు దుర్మరణం పాలయ్యాయి. ఈ సంఘటన బొయిపరిగుడ సమితి కొలార్ గ్రామ పంచాయతీ హతిపకన సమీపం గదియగుడ గ్రామంలో జరిగిందని సమాచారం. ఆ గ్రామంలో ఉరుములతో కూడిన వర్షం అకస్మాత్తుగా పడి పిడుగులు పడటంతో ఒక ఆవుతోపాటు రెండు మేకలు మరణించాయి. అందిన సమాచారం ప్రకారం గదియగుడ గ్రామంలో ఒక పశువుల కాపరి ఆవులు గొర్రెలు, మేకలను మేతకు గ్రామ సమీపంలో అడవికి తీసుకువెళ్లాడు. అకస్మాత్తుగా ఉరుములు మెరుపులతో వర్షం పడటంతో అతడు చెట్టు కిందకు వెళ్లి తల దాచుకున్నాడు. ఆ సమయంలో పశువులు ఉన్న చోట పిడుగులు పడ్డాయి. ఆ ప్రమాదంలో ఒక ఆవు, రెండు మేకలు మరణించాయి. పశువుల కాపరి పిడుగు పడిన చోటుకి కొంత దూరంలో ఉండటం వల్ల అతడు తృటిలో ప్రమాదం నుంచి బయట పడ్డాడు. పిడుగు పడి ఆ గ్రామం భీమ బొడొనాయిక్ ఆవు, రతన శిశా,గురు కిరసానిల రెండు మేకలు మరణించాయని తెలిపారు.

బీజేపీలోకి నువాపడ మాజీ ఎమ్మెల్యే కుమారుడు



రాష్ట్ర ముఖ్యమంత్రి సమక్షంలో బీజేపీలో చేరిన జాయ్ ఢొలొఖియా

భువనేశ్వర్:

నువాపడా శాసన సభ నియోజక వర్గం ఉప ఎన్నికకు ముందు మాజీ ఎమ్మెల్యే రాజేంద్ర ఢొలొకియా కుమారుడు జాయ్ ఢొలొకియా శనివారం భారతీయ జనతా పార్టీలో అధికారికంగా చేరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్, మంత్రి సూర్య వంశీ సూరజ్, బీజేపీ సీనియర్ నాయకుడు బసంత పండా, ఎమ్మెల్యే జయ నారాయణ మిశ్రా, ఇతర సీనియర్ బీజేపీ నాయకులు, బీజేపీ కార్యకర్తల సమక్షంలో ఆయన రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో కాషాయ పార్టీలో చేరారు. ఇది రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనం రేపింది. నువాపడా ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో జాయ్ ఢొలొకియా భారతీయ జనతా పార్టీలో చేరడంతో ఈ ఎన్నిక రాష్ట్ర రాజకీయాల్లో రసవత్తర ఘట్టంగా మలుపు తిరిగింది. ఆయన తండ్రి దివంగత రాజేంద్ర ఢొలొకియా బిజూ జనతా దళ్ విశ్వాస పాత్రుడుగా జీవితాంతం కొనసాగారు. బీజేడీ అభ్యర్థిగా నువాపడా నియోజక వర్గం నుంచి వరుసగా 4 సార్లు విజేతగా నిలిచి దీర్ఘ కాలం ప్రాతినిధ్యం వహించారు. నువాపడా ఉప ఎన్నికలో జాయ్ ఢొలొకియా భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడం తథ్యమని తేటతెల్లమైంది. జాయ్ ఢొలొకియా చేరిక నువాపడాలో బీజేపీ గెలుపు అవకాశాలను బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. భారతీయ జనతా పార్టీ లక్ష్యం ఛేదించేందుకు మార్గం సుగమమైంది. 2024 శాసన సభ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థిగా సీనియర్ నాయకుడు బసంత్ పండా కుమారుడు అభినందన్ పండా బీజేడీ అభ్యర్థి రాజేంద్ర ఢొలొకియా మరియు ఘసిరామ్ మాఝి కంటే వెనుకబడి మూడో స్థానంలో నిలిచారు. జాయ్ ఢొలొకియా బీజేపీలో చేరడం బసంత్ పండా పరపతిని ప్రభావితం చేస్తుంది. నవంబర్ 11న నువాపడా శాసన సభ నియోజక వర్గంలో ఉప ఎన్నిక జరుగనుంది. జాయ్ ఢొలొకియా పార్టీ ఫిరాయింపు నువాపడా ఉప ఎన్నికని ఉత్కంఠ భరితంగా మలిచింది. ఈ పరిణామం వారసత్వ ఓటు బ్యాంకు విభజన ప్రేరేపిస్తుంది. దశాబ్దాల తరబడి ప్రజా సేవలో దివంగత రాజేంద్ర ఢొలొకియా బలమైన వ్యక్తిగత అనుచరులను కూడగట్టుకున్నారు. దీని వల్ల నువాపడాలో బిజూ జనతా దళ్ బలమైన స్థానం సొంతం చేసుకుంది. ఈ వ్యవస్థతో ఆయన కుమారుడు జాయ్ డొలొఖియా గెలుపు తథ్యమనే భావన ఉభయ బీజేపీ, బీజేడీలో తొలి నుంచి స్థిరపడింది. చివరి క్షణంలో బీజేపీలోకి దాటవేత బీజేడీకి మింగుడు పడని పరిస్థితిగా తలెత్తింది.

స్థానిక విశ్వసనీయతపై బీజేపీ ఆశలు

ఢొలొకియా పరివారం పట్ల నువాపడా నియోజక వర్గంలో స్థిరపడిన విశ్వసనీయత జాయ్ ఢొలొకియా ప్రవేశంతో చేజిక్కించుకున్నట్లు బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం ఉరకలేస్తుంది. మరో వైపు ఈ నియోజక వర్గం తిరుగులేని బీజేపీ నాయకుడిగా వెలుగొందిన బసంత్ పండా కొంత మేరకు నిరుత్సాహపడినట్లు బీజేపీ శిబిరం సమాచారం. పార్టీ పట్ల విధేయతతో ఆయన చిత్తశుద్ధితో వ్యవహరిస్తే తప్ప బీజేపీ గెలుపు బాట నికరం కాని ప్రతికూల పరిస్థితులు పొంచి ఉన్నాయి. బసంత్ పండా అంకిత భావం బీజేడీ (రాజేంద్ర డొలొకియా) సానుభూతి, వారసత్వ ఓటు బ్యాంకు చీలికని కొంత మేరకు సర్దుబాటు చేస్తుంది. ఢొలొకియా, పండా మధ్య నిష్కల్మష ఐక్యత ఉప ఎన్నికలో బీజేపీ విజయానికి తొలి మెట్టుగా నిలుస్తుంది. వచ్చే నెలలో జరగనున్న నువాపడా నియోజక వర్గం ఉప ఎన్నికలో సమగ్రంగా బీజేడీ, బీజేపీ, కాంగ్రెస్ మధ్య త్రిముఖ పోటీ తీవ్రతరమైంది. గత ఎన్నికల విశ్లేషణ ప్రకారం త్రిముఖ పోటీలో కాంగ్రెసు అభ్యర్థి ఘసిరామ్ మాఝి పరిస్థితి పదిలంగా గోచరిస్తుంది. 2024లో రాజేంద్ర ఢొలొకియా చేతిలో దాదాపు 10,000 ఓట్ల తేడాతో రెండో స్థానంలో నిలిచిన కాంగ్రెస్‌కు చెందిన ఘసిరామ్ మాఝి తన స్థావరాన్ని మరింత బలోపేతం చేసుకోగలిగే అవకాశం లేకపోలేదు. చివరి క్షణం వరకు దివంగత సిటింగ్ ఎమ్మెల్యే కుమారునిపై సానుభూతి ఓట్లు పోలింగ్ పట్ల గట్టి నమ్మకం పెట్టుకున్న బీజేడీ పరిస్థితి డోలాయమానంగా మారింది. జాయ్ డొలొకియా పార్టీ ఫిరాయింపు ఆకస్మిక పరిణామం నేపథ్యంలో విపక్షం హోదాకు దిగజారిన బిజూ జనతా దళ్ సొంత కేడర్, సంస్థాగత యంత్రాంగంపై ఆధారపడి ఉప ఎన్నిక పోరు నుంచి గట్టెక్కాల్సిన పరిస్థితి నెలకొంది.

క్లుప్తంగా

ధాన్యం డబ్బులు చెల్లించండి



వినతిపత్రంతో రైతు కృష్ణ కమర

జయపురం: గత రబీ సీజన్‌లో తాను మండీలో అమ్మిన ధాన్యం డబ్బులు చెల్లించాలని కోరుతూ ఒక రైతు జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం శౌశ్యారెడ్డి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. జయపురం సబ్ డివిజన్ కోట్‌పాడ్ సమితి చిత్ర గ్రామానికి చెందిన రైతు కృష్ణ కమర నాలుగు నెలల క్రితం కోట్‌పాడ్ సమితి చిత్ర ధాన్యం మండీలో 37 క్వింటాళ్ల ధాన్యం అమ్మాడు. అయితే లేంప్స్ కార్యాలయ బాధ్యతలు నిర్వహిస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్ బ్యాంక్ ఐఎఫ్‌ఎస్‌సీ నంబర్ తప్పుగా వేయడం వలన తనకు రావాల్సిన రూ.1.14 లక్షలు బ్యాంక్ ఖాతాల్లో జమ అవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

గుడారిలో గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితుడు

రాయగడ: గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు జిల్లాలోని గుడారి పోలీసులు ఆకస్మిక దాడులను నిర్వహించి అందుకు సంబంధించి నిందితుడిని పట్టుకున్నారు. అతని నుంచి రూ.177 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు తరలించారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ బీరేంద్ర రాయ్, ఎస్‌ఐ సంజయ్ ఛత్రలు తెలియజేసిన వివరాల ప్రకారం గుడారి పోలీస్ స్టేషన్ పరిధిలోని సరిగిగుడ గ్రామ సమీపంలో గల ఒక తోటలో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్న సమాచారం అందటంతో ఈ దాడులను నిర్వహించినట్లు తెలియజేశారు.

రైల్వే ప్రయాణికుల సలహాల సేకరణ



ప్రయాణికుల సలహాలు తీసుకుంటున్న ఏడీఆర్ఎం కె.రామారావు, ఎం.ఎస్.ఎన్.మూర్తి

కొరాపుట్: అమ్రిత్ సంవాద్ కార్యక్రమంలో భాగంగా ప్రయాణికుల సలహాలు రైల్వే శాఖ అధికారులు తీసుకున్నారు. శనివారం కొరాపుట్ రైల్వే స్టేషన్‌లో ఏడీఆర్ఎం (ఆపరేషన్స్) కె.రామారావు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి.. స్టేషన్‌కి వచ్చిన ప్రయాణికులతో మమేకమయ్యారు. స్టేషన్లలో సౌకర్యాలు, అభివృద్ధి, లోపాలు తదితర అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. పలువురు ప్రయాణికులు స్వయంగా వచ్చి సూచనలు చేశారు. సీనియర్ డివిజనల్ ఎలక్ట్రిక్ ఇంజినీర్ ఎం.ఎస్.ఎన్.మూర్తి పాల్గొన్నారు.

అభ్యంతరకర పోస్టు.. యువకుడి అరెస్టు

రాయగడ: సామాజిక మాధ్యమాల్లో రాయగడ జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహోరోపై అభ్యంతరకరమైన పోస్టులను ఫేస్‌బుక్‌లో పెట్టినందుకు సదరు పోలీసులు దిలీప్ కుమార్ పాఢి అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో కుహోరాపై అవాస్తవ ఆరోపణలు చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేస్తుండడంతో కుహోరా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ స్పందించి వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం ఎస్పీ స్వాతి ఎస్.కుమార్‌కు ఈ విషయాన్ని తెలిపారు. శనివారం యువకుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

యువకుడు అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని అరసవల్లి సెగిడివీధికి చెందిన ఓ విద్యార్థి అదృశ్యమైనట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు. పాతబస్టాండ్‌లో పండ్ల దుకాణం నడుపుతున్న పొట్నూరు వెంకటరమణకు కుమార్తె, కుమారుడు సాయికృష్ణ (28) ఉన్నారు. సాయికృష్ణ ఇంటి వద్దనే ఉంటూ సివిల్స్‌కు ప్రిపేరయ్యేవాడు. ఈ ఏడాది జనవరి 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడో దూరంగా ఉంటూ చదువుకుంటాడని భావించి వెతకడం మానేశారు. నెలలు గడుస్తున్నా ఆచూకీ లేకపోవడంతో శనివారం రాత్రి విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు.

‘ఆడపిల్లలకు అనేక సంక్షేమ పథకాలు’



అంతర్జాతీయ కన్యాసంతాన దినోత్సవం సందర్భంగా ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా సామాజిక సంక్షేమ శాఖ పీఓ సరలా పాత్రో



కన్యామనులకు ప్రశంసాపత్రాలు అందజేసిన డీడబ్ల్యూఓ మనోరమా దేవి



కన్యాసంతానంపై మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అనుప్ పండా

పర్లాకిమిడి: ఆడపిల్ల సంతానం వల్ల కుటుంబానికి సమాజానికి నష్టం ఏమీ లేదని, వారికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అందజేస్తోందని సబ్‌కలెక్టర్ అనుప్ పండా అన్నారు. గజపతి జిల్లా స్థాయిలో అంతర్జాతీయ కన్యాసంతానం దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ పండా ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. నేటి బాలిక రేపటి రోజు మాతృమూర్తిగా, ఒక జడ్జి, సాఫ్ట్‌వేర్, కలెక్టర్, ఎస్పీగా అనేక బాధ్యతలు నిర్వహిస్తుందని అన్నారు. అనంతరం జిల్లా పాలనాధికారి కార్యాలయం ఓస్వాన్ భవనంలో సమావేశంలో పలువురు వక్తలు పాల్గొన్నారు. వారిలో ముఖ్యంగా జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, జువెనెల్ కోర్టు ప్యానల్ లాయర్ భాగ్యలక్ష్మీ నాయక్, అదనపు డీహెచ్‌ఓ డాక్టర్ రబినారాయణ దాస్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఉదయం కలెక్టర్ కార్యాలయం నుంచి సి.డి.పి.ఓ. జిల్లా సామాజిక సంక్షేమ శాఖ ప్రోగ్రాం అధికారి సరలా పాత్రో, సునితా రోథో ఆధ్వర్యంలో ర్యాలీ జరిపారు.

‘బాలికలపై వివక్ష సరికాదు’



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ కులకర్ణి, మీనతి దేవ్ తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న యువతులు

రాయగడ: బాలికలపై వివక్ష చూపడం సరికాదని కలెక్టర్ అశుతోష్ కులకర్ణి అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశం హాల్‌లో శనివారం జరిగిన అంతర్జాతీయ కన్యా దినోత్సవ కార్యక్రామానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కన్యా శిశువుల సంరక్షణ, వారిని విద్యావంతులను చేయడం, అన్ని రంగాల్లో ప్రోత్సహించడం అందరి కర్తవ్యమని పేర్కొన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కూడా అడుగులు వేస్తోందని, వారి సంరక్షణ కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. సమాజాభివృద్ధికి కన్యా శిశువుల పాత్ర చాలా కీలకమని ఉద్బోధించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సామాజిక సురక్షా అధికారి మీనతీ దేవ్ మాట్లాడుతూ అనేక ఆందోళనలు, పోరాటాల ఫలితంగా 1920 నుంచి మహిళలకు ఓటు హక్కు దక్కిందని అన్నారు.

ఉత్సాహంగా పోషణ వేడుకలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమశాఖ అధికారి మనోరమాదేవి

పర్లాకిమిడి: జిల్లా స్థాయి రాష్ట్రీయ పోషణ మాసోత్సవాన్ని స్థానిక కలెక్టరేట్ కాన్ఫరెన్సు హాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ఫాల్గునీ మఝి, జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి మనోరమా దేవి, మిషన్ శక్తి డైరెక్టర్ టిమోన్ బోరా, ప్రోగ్రాం, ప్రొటెక్షన్ అధికారి శారదా పట్నాయక్, పీవో సునీతా రోథ్ పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలలకు నెల రోజుల పాటు పోషకాహారం అందించాలని ఏడీఎం ఫల్గునీ మఝి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ హాల్ బయట అంగన్‌వాడీ వర్కర్లు పోషక విలువల కలిగిన కాయగూరలు, వంటల ప్రదర్శన స్టాల్ నిర్వహించారు. ఈ నెల 16వ తేదీ వరకూ జిల్లాలోని అన్ని సమితి కేంద్రాల్లో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను నిర్వహిస్తామని ప్రోగ్రాం ఆఫీసర్ శారదా పట్నాయక్ తెలిపారు.



అంగన్‌వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన పిండి వంటల స్టాల్



కార్యక్రమానికి విచ్చేసిన మహిళలు

18న చెకుముకి సైన్స్ సంబరాలు



మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ గిరిధర్

శ్రీకాకుళం: చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని యూటీఎఫ్ భవనంలో చెకుముకి సైన్స్ సంబరాల కన్వీనర్ పి.కూర్మారావు అధ్యక్షతన పోస్టర్లు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలు పాఠశాల స్థాయిలో అక్టోబర్ 18న, మండల స్థాయిలో నవంబర్ 1న, జిల్లా స్థాయిలో నవంబర్ 23న, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 12 నుంచి 14 తేదీల్లో జరుగుతాయని వివరించారు. విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, సైన్స్ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కామేశ్వరరావు, జి.వాసుదేవరావు, ఎస్.సాయి శ్రీనివాస్ శర్మ, యూటీఎఫ్ జిల్లా నాయకులు బి.శ్రీరామ్మూర్తి, పి.అప్పారావు, బి.ధనలక్ష్మి, ఎస్.స్వర్ణకుమారి, బి.మోహనరావు, ఎస్.సంజీవరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పద్యకవితల పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యువ రచయితల వేదిక అధ్యక్షురాలు తంగి ఎర్రమ్మ ఆధ్వర్యంలో జరిగిన నెలవారీ సమావేశంలో శనివారం పద్యకవితల పోటీలు ఉత్సాహంగా సాగాయి. బొంతు సూర్యనారాయణ, బోకర శ్రీనివాసరావు, రోణంకి విశ్వేశ్వరరావులు తొలి మూడు స్థానాల్లో నిలవగా.. రెడ్డి పద్మావతి, కుప్పిలి వెంకటరమణలకు కన్సోలేషన్ బహుమతులు లభించాయి. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ జిల్లా ఎన్విరాన్‌మెంట్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, విశ్రాంత అధ్యాపకులు పిలకా శాంతమ్మ, డి.పార్వతీశం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం భాషాభివృద్ధిపై ఆర్.ఢిల్లీశ్వరరావు, ఆర్.విశ్వేశ్వరరావు, ఆర్.పద్మావతి, జి.గోపాలకృష్ణ, కె.జనార్దనరావు, డి.పార్వతీశం, డి.ఈశ్వరరావులు కవితల్ని వినిపించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.మాలతి, జి.సునీత, శివతేజ, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పర్లాకిమిడి: లబార్ సింగి వద్ద పేకాట శిబిరంపై ఆకస్మికంగా దాడి జరిపి తొమ్మిది మందిని అరెస్టు చేశారు. గజపతి జిల్లాలో మోహన పోలీస్‌స్టేషన్ పరిధిలో చంద్రగిరి జీపీ లబార్ సింగి వద్ద పేకాట శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని పట్టుకున్నారు. వారి వద్ద నుండి రూ.12,200లు తోపాటు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌లో మహిళా యాంకర్ మీనా ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..మీనా గత నెల 21న బీరువాలో భద్రపరిచిన బంగారు వస్తువులు చోరీకి గురవ్వడంతో ఈ నెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు చోరీకి పాల్పడిన ది సీపన్నాయుడుపేటకు చెందిన బెండి అజ య్‌గా గుర్తించారు. ఈయనపై గతంలోనూ పలు కేసులు నమోదయ్యాయి. అజయ్ నుంచి ఐదు తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

దళితుల భూముల్లో బోర్డులు

- ఆందోళనలో పెద్దబమ్మిడి దళితులు
- 2009 నుంచి అన్ని రకాల పత్రాలతో సాగు చేస్తున్నామని స్పష్టీకరణ



తమ భూముల వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న పెద్దబమ్మిడి దళితులు

టెక్కలి: అన్ని రకాల భూమిపత్రాలతో సాగు చేస్తున్న భూములను ఇప్పటికిప్పుడు ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేసి తమను అన్యాయం చేస్తున్నారని కోటబొమ్మాళి మండలం పెద్దబమ్మిడి గ్రామానికి చెందిన దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో అధికారులు తమను ఇబ్బందులు గురి చేస్తున్నారని వాపోయారు. వివరాల్లోకి వెళితే.. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పెద్దబమ్మిడి సర్పంచ్ మెండ తాతయ్య సహకారంతో గ్రామంలోని పోరంబోకు భూమిని సుమారు 38 మంది నిరుపేద దళితులకు ఒక్కొక్కరికి 26 సెంట్లు చొప్పున కేటాయించారు. భూ పట్టాలతో పాటు పాస్ పుస్తకాలు, ఇతర భూపత్రాలు అందజేశారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా పథకం, ఇటీవల అన్నదాత సుఖీభవ పథకం కూడా వర్తింపజేశారు. ప్రస్తుతం ఆయా భూముల్లో వ్యవసాయం, ఇతర పంటలను పండిస్తూ జీవనోపాధి కొనసాగిస్తున్నారు. ఇప్పుడు హఠాత్తుగా శుక్రవారం రాత్రి సమయంలో రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేయడంతో దళితులంతా ఆందోళన చెందుతున్నారు.

విద్యుత్ స్తంభం నుంచి జారిపడి ఎలక్ట్రికల్ ఉద్యోగికి గాయాలు

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ ఎలక్ట్రికల్ ఉద్యోగిగా పనిచేస్తున్న గంగు మోహనరావు పాతిన వానిపేటలో వీధిలైట్లు వేస్తుండగా స్తంభం నుంచి జారిపడిపోవడంతో బలమైన గాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం ఈ ఘటన జరగ్గా బాధితుడిని గుట్టు చప్పుడు కాకుండా అధికారులు జెమ్స్‌కు తరలించారు. బాధితుడి తలకు గాయాలయ్యాయని, చేయి విరిగిందని, మున్సిపల్ అధికారులు ఒక రోజంతా పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశా రు. దీంతో మున్సిపల్ కమిషనర్ టి.రవి శనివారం సాయంత్రం జెమ్స్‌కు వెళ్లి పరామర్శించారు. విద్యుత్ సమస్యలపై వేళాపాళా లేకుండా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను వాడుకుంటున్నారని, ప్రమా దం సంభవించినప్పుడు విడిచి పెడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

15 ప్రతిపాదనలకు మంత్రి వర్గం ఆమోదం



ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రి వర్గం సమావేశం

భువనేశ్వర్: లోక్ సేవా భవన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన జరిగిన 28వ రాష్ట్ర మంత్రి వర్గం సమావేశంలో 10 విభాగాలు ప్రతిపాదించిన 15 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఈ వివరాలను ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా మీడియాకు వివరించారు. రాష్ట్ర మంత్రి వర్గం రాష్ట్రంలో అంతర్ రాష్ట్ర నదుల అనుసంధాన పథకం ప్రతిపాదనను ఆమోదించింది. దీని కోసం పంచ వర్ష వ్యయ ప్రణాళిక రూపొందించారు. ఈ పథకం వ్యయ ప్రణాళిక రూ.1790.00 కోట్లు. ఈ నిధులను 2025–26 ఆర్థిక సంవత్సరం నుంచి 2029–30 వరకు క్రమ పద్ధతిలో అంచెలంచెలుగా వెచ్చించాలని మంత్రి మండలి నిర్ణయించింది. నీటి మిగులు నదీ పరీవాహక ప్రాంతాలను నీటి కొరత ఉన్న ప్రాంతాలతో అనుసంధానించడం ద్వారా అంతర్ రాష్ట్ర నీటి పంపిణీని బలపరచడం ఈ పథకం లక్ష్యం. దీని వల్ల కరువు స్థితిస్థాపకతను మెరుగుపరచడం, అదనపు నీటి నిల్వను సృష్టించడం, వరద ప్రమాదాలను తగ్గించడం, ఆరు ప్రధాన ప్రాజెక్టుల ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం సుసాధ్యం అవుతాయని మంత్రి వర్గం అభిప్రాయపడింది.

అంతర్ రాష్ట్ర నదీ అనుసంధానం పథకాలు

- కాట్రా లింక్ ప్రాజెక్ట్ (కంసపాల్ ఐఎస్ఎస్ నుండి ఫీడర్ ఛానల్)
- వంశధార – రుషికుల్య (నందిని నల్లా) ఇంట్రా
- లింక్ ప్రాజెక్ట్
- హిరాధర్బాతి వరద ప్రవాహ కాలువ ప్రాజెక్ట్
- బహుదా – తంపరా లింక్ ప్రాజెక్ట్
- ఓంగ్ – సుక్ తేల్ గార్లాండ్ కాలువ ప్రాజెక్ట్
- తెలంగిరి – ఎగువ కోలాబ్ పీఎస్‌పీ ప్రాజెక్ట్

మానసిక ఆరోగ్యంపై అవగాహన



వేదికపై అతిథులు



పాల్గొన్న విద్యార్థులు

జయపురం: జయపురం సమితి అంబాగుడ గ్రామ పంచాయతీ రొండాపల్లిలో కొరాపుట్ న్యాయ సేవా ప్రదీకరణ ఆధ్వర్యంలో మానసిక వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. కొరాపుట్ జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షులు ప్రదీప్ కుమార్ మహంతి సూచన మేరకు రొండాపల్లిలోని జయపురం కాలేజీ ఆఫ్ ఫార్మసీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో సివిల్ కోర్టు రిజిస్ట్రార్, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం ఇన్‌చార్జి కార్యదర్శి బిష్ణు ప్రసాద్ దేవత ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా అక్టోబర్ పదో తేదీన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మానసిక ఆరోగ్య ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించటంతో పాటు మానసిక ఆరోగ్యంపై ప్రజలను చైతన్యవంతులను చేయడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు అన్నారు. న్యాయాధికారులు హరమాన్ దాస్, భీష్మ రౌత్ రాయ్, జయపురం కాలేజీ ఆఫ్ ఫార్మసీ రొండాపల్లి డైరెక్టర్ ప్రియంబద సారంగి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యబ్రత జెన, జిల్లా వైద్యాధికారి డాక్టర్ దిలీప్‌కుమార్ జెన, జయపురం వైద్యాధికారి డాక్టర్ సవ్యసాచి మహాపాత్రో, శిశుకళ్యాణ కమిటీ సభ్యురాలు భానుమతి పూజా తదితరులు ప్రసంగిస్తూ మానసిక ఆరోగ్యంపై అందరూ దృష్టిసారించాలన్నారు. మానసిక వ్యాధుల నియంత్రణ, మానసిక రోగుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

రైల్లో ప్రయాణికుడికి అస్వస్థత



దిలీప్‌కుమార్‌ను 108లో తరలిస్తున్న సిబ్బంది

ఆమదాలవలస : రైల్వే ప్రయాణికుడికి ఛాతీనొప్పి రావడంతో 108లో హుటాహుటిన చికిత్స అందించారు. శనివారం గుణుపూర్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న గుణుపూర్ పాసింజర్‌లో పర్లాకిమిడి సమీపంలోని కాజీపేటకు చెందిన ఎం.దిలీప్‌కుమార్ ప్రయాణిస్తున్నాడు. ఉర్లాం సమీపంలోకి వచ్చేసరికి ఛాతిలో నొప్పి వస్తుందని తోటి ప్రయాణిలకు చెప్పాడు. దీంతో వారు 108కు ఫోన్‌చేసి శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌కు రావాలని తెలియజేశారు. రైలు చేరుకునే సమయానికి 108 సిబ్బంది మూడో నంబర్ ప్లాట్‌ఫాం వద్దకు చేరుకొని బాధితునికి ప్రథమచికిత్స అందించారు. తీవ్రత ఎక్కువగా ఉండటంతో అదే అంబులెన్సులో శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఇంతలో దిలీప్‌కుమార్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు ఆస్పత్రికి చేరుకున్నారు.

వీఆర్‌ఓల సంఘం కార్యవర్గ ఎన్నిక



ఎన్నికైన ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అడ్‌హక్ అధ్యక్షుడిగా డి.రాజేష్ ఎన్నికయ్యారు. శనివారం శ్రీకాకుళంలోని రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోన అంజనీకుమార్ (చంటి) అధ్యక్షతన వీఆర్‌ఓల సమావేశం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రామ రెవెన్యూ అధికారులు (గ్రేడ్–1, 2, ప్రమోటీ, నామినీ) హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా డి.రాజేష్, సహాధ్యక్షుడిగా ప్రవీణ్, జనరల్ సెక్రటరీగా బి.రాంజీ, ట్రెజరర్‌గా జి.ఢిల్లేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎస్.అప్పలనాయుడు, పి.శ్రావణి, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.కొండలరావు, ధనలక్ష్మి, వెబ్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ సెక్రటరీగా మనోజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విశ్వనాథం, స్పోర్ట్సు అండ్ కల్చరల్ సెక్రటరీగా నాగరాజు, స్టేట్ ఈసీ సభ్యులుగా గణేష్ ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ స్టేట్ సెక్రటరీ పి.శ్రీనివాస్, జిల్లా జనరల్ సెక్రటరీ బి.వి.వి.ఎస్.రాజు, ఏపీవీఆర్ఏ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ అనుపమ, అసోసియేట్ ప్రెసిడెంట్ బొమ్మిరెడ్డిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిక్కోలు పుస్తక మహోత్సవానికి ఆహ్వానం



మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ డాక్టర్ కె.సుధీర్

శ్రీకాకుళం కల్చరల్: వచ్చే నెలలో జరగనున్న సిక్కోలు పుస్తక మహోత్సవానికి రచయితలకు, అభిమానులకు ఆహ్వానం పలుకుతున్నామని కమిటీ చైర్మన్ డాక్టర్ కె.సుధీర్ కోరారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవనంలో సిక్కోలు పుస్తక మహోత్సవ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రదేశాల్లోనూ భారీ ఎత్తున పుస్తక ప్రదర్శనలు జరిగాయని, మన జిల్లాలో తొలిసారి నిర్వహిస్తుండటం శుభ పరిణామమన్నారు. కమిటీ కో–చైర్మన్ అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ సాంస్కృతిక వేదికపై జిల్లా సంస్కృతిని ప్రతిబింబించే తప్పెటగుళ్లు, జముకుల పాట, కోలాటం, పగటి వేషాలు, నాటికలు, డ్యాన్సులు, సంగీత ప్రదర్శనలు, ఏకపాత్రాభినయాలు తదితర ప్రదర్శనలు జరగనున్నాయని వివరించారు. విద్యార్థులతో సైన్స్‌ఫెయిర్ ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కమిటీ కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలి వద్ద ఎన్‌టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో నవంబరు 11 నుంచి 20 వరకు జరిగే సిక్కోలు పుస్తక మహోత్సవం–2025, సాహిత్య, సాంస్కృతిక వైజ్ఞానిక సంబరాల్లో 100 ప్రచురణకర్తలు బుక్ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారని వివరించారు. సాహిత్య, సాంస్కృతిక, విజ్ఞాన ఆహార, మీడియా, ప్రచార, శానిటేషన్, సెక్యూరిటీ, ఆర్థిక సబ్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో వివిధ ప్రజాసంఘాలు, సాహిత్య సంస్థల సభ్యులు కంచరాన భుజంగరావు, చీకటి దివాకర్, గొంటి గిరిధర్, పి.సుధాకర్, కొత్తకోట అప్పారావు, ఎల్.రామలింగస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఎస్‌డీఓగా వెంకటేశ్వరరావు

- శ్రీధర్‌రావుకు పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ


డీఎస్‌డీఓగా నియమితులైన వెంకటేశ్వరరావు

విజయనగరం: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి (డీఎస్‌డీఓ)గా ఎస్.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. విశాఖ జిల్లా అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయనను విజయనగరం జిల్లాకు బదిలీ చేస్తూ శాప్ ఎం.డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన కె.శ్రీధర్‌రావును పార్వతీపురం మన్యం జిల్లాకు చేస్తూ బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా విజయనగరం జిల్లా హాకీ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.మహేష్‌బాబుకు శ్రీకాకుళం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారిగా బాధ్యతలు అప్పగించారు. తాజా బదిలీ ఉత్తర్వుల మేరకు సంబంధిత అధికారులు వెనువెంటనే బాధ్యతలు స్వీకరించాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారిగా నియామకమైన వెంకటేశ్వరరావుకు గతంలో జిల్లాలో పని చేసిన అనుభవం ఉంది.

ఇసుక అక్రమ తరలింపు అడ్డగింత


తహసీల్దార్ కార్యాలయం వద్ద స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామం వద్ద వేగావతి నదిలో అక్రమంగా ఇసుకను తవ్వి తరలించేందుకు సిద్ధం చేసిన ట్రాక్టర్లను తహసీల్దార్ ఎం.శ్రీను శనివారం పట్టుకున్నారు. రెవెన్యూ, పోలీసులతో కలిసి ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయం వద్దకు తరలించారు. శని,ఆదివారాలు సెలవు దినాలు కావడంతో అధికారులెవరూ విధుల్లో ఉండరని భావించిన ట్రాక్టర్ యజమానులు శనివారం ఉదయం ఆరు గంటలకే ఇసుక తవ్వకాలకు జేసీబీని సిద్ధం చేసుకుని వరుస క్రమంలో జేసీబీతో నదిలో ఇసుకను తోడుతున్నారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్ రెవెన్యూ, పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేయడంతో దాడిచేసే సమయానికి జేసీబీ, కొన్ని ట్రాక్టర్లు తప్పించుకోగా ఇసుకను లోడు చేసేందుకు సిద్ధంగా ఉన్న ఏడు ఖాళీ ట్రాక్టర్లను తహసీల్దార్ అదుపులోకి తీసుకున్నారు. యజమానులను పిలిపించి హెచ్చరించారు. ట్రాక్టర్ల నంబర్లు తీసుకుని అక్రమ ఇసుక రవాణాతో దొరికితే తీవ్రపరిణామాలుంటాయని హెచ్చరించి విడిచిపెట్టారు. ట్రాక్టర్ యజమానుల సంఘం ప్రతినిధులతో మాట్లాడుతూ ఇది చివరి అవకాశమని మరో మారు దొరికితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాముకాటుతో మహిళ మృతి


మృతురాలు దమయంతి (ఫైల్)

సంతకవిటి: మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన గొర్లె దమయంతి (50) పాముకాటుకు గురై మృతిచెందింది. దీనిపై ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 10న దమయంతి తన పొలంలో నీరు పెట్టేందుకు వెళ్లింది. ఆమె నీరు పెడుతున్న సమయంలో గుర్తుతెలియని పాము కాటు వేసింది. ఈ విషయాన్ని గ్రామంలో ఉన్న భర్త తారకేశ్వరరావుకు ఫోన్‌లో తెలియజేయగా వెంటనే స్థానికులు డోల రామారావు, చిత్తిరి సూర్యనారాయణలను తీసుకుని పొలానికి వస్తున్న భర్తకు ఎదురుగా వచ్చిన దమయంతి పాము కాటువేసిన గాయాన్ని చూపి స్పృహకోల్పోయింది. హుటాహుటిన అప్రమత్తమైన భర్తతోపాటు గ్రామస్తులు పొందూరు ప్రభుత్వ ఆస్పత్రికి ఆమెను తరలించి ప్రథమ చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్యులు రిఫర్ చేశారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు వెల్లడించారు. మృతురాలి భర్త తారకేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై వెల్లడించారు.

పిడుగుపడి వ్యక్తి మృతి


నాయుడు (ఫైల్)

రేగిడి: మండల పరిధిలోని రెడ్డిపేట గ్రామానికి చెందిన కొబగాన నాయుడు (45) శనివారం పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు, స్థానికులు అందించిన వివరాల ప్రకారం నాయుడు ఆటో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ తనకున్న కొద్దిపాటి పొలంలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగానే జొన్న పిక్కలను సాయంత్రం 4 గంటల సమయంలో తన పొలంలోనే శ్మశానవాటిక వద్ద ఆరబెడుతున్నాడు. అదే సమయంలో ఒక్కసారిగా పెద్ద ఉరుము ఉరమడంతో దగ్గర్లోనే పిడుగు పడి సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. దగ్గర ప్రాంతంలో ఉన్న రైతులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. దీంతో వారంతా వచ్చి భోరున విలపించారు. మృతుడికి భార్య సుగుణ, ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్ద కుమార్తె రాధికకు వివాహం చేశారు. లాకిని అనే రెండో అమ్మాయి డిగ్రీ చదువుతోంది. భార్య సుగుణ, తల్లిదండ్రులు రామినాయుడు, జయమ్మలు నాయుడు మృతితో భోరున విలపించారు. ఈ సమాచారం తెలుసుకున్న వీఆర్వో కె.ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి గోపాలనాయుడు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై బాలకృష్ణ సిబ్బందితో కలిసి వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని రాజాం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

కాలం చెల్లిన కందిపప్పు

- అకస్మిక తనిఖీలో గుర్తించిన ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్
- అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంతో చెలగాటం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గర్భిణులు, బాలింతలు


రామభద్రపురం అంగన్‌వాడీ కేంద్రం-5లో కాలం చెల్లిన కందిపప్పు ప్యాకెట్లు పరిశీలిస్తున్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి (ఫైల్)

రామభద్రపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు ఆరోగ్యం, పౌష్టికాహారం, భద్రత కల్పించే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేయాలి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడం లేదు. నాణ్యమైన పౌష్టికాహారం అందజేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. పురుగులు పట్టిన, నాసిరకానిదే కాకుండా కాలం చెల్లిన కందిపప్పును గర్భిణులు, బాలింతలకు సరఫరా చేస్తున్నారు. అలాగే ఈ కాలం చెల్లిన కందిపప్పునే అంగన్వాడీ సెంటర్లలోని చిన్నారులకు వండిపెడుతున్నారు. ఇందుకు నిదర్శనం ఈ నెల 9వ తేదీన ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి రామభద్రపురం మండలకేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్-5ను అకస్మికంగా తనిఖీ చేసి 8 ప్యాకెట్లు కాలం చెల్లిన కందిపప్పు ఉన్నట్లు గుర్తించి కంగుతిన్నారు. ఇలాంటి కందిపప్పు తిన్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఏదైనా అనారోగ్యం బారిన పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ఐసీడీఎస్ అధికారులపై ఆగ్రహంతో పాటు ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లావ్యాప్తంగా 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులుండగా వాటి పరిధిలో మెయిన్, మినీ మొత్తం కలిపి 2499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలకు సివిల్ సప్లయిస్ గోదాముల నుంచి రేషన్ డీలర్లకు, వారి నుంచి అంగన్వాడీ సెటర్లకు సరుకులు సరఫరా చేస్తారు. అయితే సరుకు తయారైన మూడు నెలలకు గోదాంకు చేరుతుందని అధికార సమాచారం. గోదాముకు చేరిన సరుకును ఈ కందిపప్పులో పురుగులు ఉన్నాయో? లేక నాసిరకంగా ఉందో సంబంధిత అధికారులు కనీసం పరిశీలించకుండా వచ్చిన సరుకు వచ్చినట్లు గానే ఒక నెల తర్వాత రేషన్ డీలర్ల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. అయితే తయారైన కందిపప్పు అక్కడే సుమారు మూడు నెలల తర్వాత కేంద్రాలకు చేరుతుంది.ఆ పప్పు కాలపరిమితి ఆరు నెలలు. సెంటర్లలో టీచర్లు నిర్లక్ష్యంగా పక్కన పడేస్తూ ఆ పప్పునే కేంద్రాలకు వచ్చిన చిన్నారులకు వండి పెట్టడంతో పాటు గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్నారు. అయితే గడువు ఉండగానే పంపిణీ చేస్తున్నామని గోదాము అధికారులు చెబుతుండగా, తక్కువ కాలం ఉన్న కందిపప్పు ప్యాకెట్లు సరఫరా అవుతున్నాయని అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. ఓ వైపు ప్రభుత్వం శ్రద్ధ వహించకపోవడం, మరో వైపు అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని పలువురు మండిపడుతున్నారు.


రామభద్రపురం అంగన్‌వాడీకేంద్రాలకు సరఫరా అయిన నాసిరకం కందిపప్పు

పర్యవేక్షణ కరువు..

జిల్లా ఉన్నతాధికారుల గోదాముల పర్యవేణలేకపోవడంతో సరుకుల సరఫరా దారులు ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నారని,అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించిన స్త్రీ సంక్షేమాధికారులు కూడా తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారని పలువురు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాల పరిమితి ఉన్న కందిపప్పు సరఫరా

మా గోదాముకు మార్చి నెలలో వచ్చిన కందిపప్పును రామభద్రపురం అంగన్‌వాడీ కేంద్రం-5కు డీలర్ ద్వారా జూలై నెలలో పంపిణీ చేశాం. ఆ పప్పు ఆగస్టు నెలతో కాలం చెల్లుతుంది. అయితే ఆ పప్పు ఇప్పటి వరకు పంపిణీ చేయకుండా వదిలేయడం అంగన్‌వాడీ నిర్వాహకుల తప్పిదం. కాంట్రాక్టర్ నుంచి నేరుగా గోదాంకు కందిపప్పు ప్యాకెట్లుతో ఉన్న బస్తాలు చేరుతాయి. వాటిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తాం.

సూర్యప్రకాష్, గోదాం ఇన్‌చార్జి, బొబ్బిలి

సూపర్‌వైజర్, టీచర్‌కు మెమోలు

రామభద్రపురం అంగన్‌వాడీ సెంటర్-5లో ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి 8 కాలం చెల్లిన కందిపప్పు ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. ఐసీడీఎస్ ఆదేశాల మేరకు సంబంధిత సూపర్‌వైజర్‌తో పాటు టీచర్‌కు మెమోలు జారీ చేస్తున్నాం.

ఎం.వరహాలమ్మ, సీడీపీవో బాడంగి

పువ్వల నాగేశ్వరరావు మృతి

- దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర
- నివాళులర్పించిన ఎమ్మెల్సీ బొత్స, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


పువ్వల నాగేశ్వరరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య తదితరులు


పువ్వల నాగేశ్వరరావు మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాలూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సాలూరు పట్టణ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ పువ్వల నాగేశ్వరరావు మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం రాత్రి విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. నాగేశ్వరరావు మరణ వార్త తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం ఉదయం లక్ష్మి థియేటర్ వద్ద ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. నాగేశ్వరరావు మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రతిపక్షనేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తదితర ప్రముఖులు సాలూరు వచ్చి నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. నాగేశ్వరరావు సేవలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. నాగేశ్వరరావు సతీమణి ప్రస్తుత మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, కుమారుడు శ్రీనువాసరావు, కుమార్తె, కుటుంబీకులు, బంధువులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల విషణ్నవదనాల మధ్య నాగేశ్వరరావు అంత్యక్రియలు శనివారం పూర్తయ్యాయి.

విద్య, ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలి


టిక్కబాయిలో తాగునీటి వసతులు పరిశీలిస్తున్న జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందివ్వడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక దృష్టి సారించాలని జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఈమేరకు శనివారం ఆయన గుమ్మలక్ష్మీపురం మండలంలోని దుడ్డుఖల్లు, దొరజమ్ము, టిక్కబాయి గ్రామాల్లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలతో పాటు రేగిడి, పి.ఆమిటి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా పాఠశాలల్లోని తాగునీటిని, మరుగుదొడ్లు, స్నానపు గదులు, పాఠశాల ఆవరణ, వసతి గృహాల ఆవరణను పరిశీలించారు. పాఠశాల ఆవరణ, మరుగుదొడ్లును ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని, భోజనంలో ప్రోటీన్లు, విటమిన్లు ఉండేలా ఆకు, కూరగాయలు, గుడ్లను ఇవ్వాలని, అనారోగ్యానికి గురైనట్లు గుర్తించిన వెంటనే వైద్య సదుపాయాలు కల్పించాలని హెచ్ఎంలు, డిప్యూటీ వార్డెన్లకు సూచించారు. తన పర్యటనలో భాగంగా కురుపాంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను కూడా సందర్శించారు. ఆయన వెంట గుమ్మలక్ష్మీపురం ఎంఈఓ బి.చంద్రశేఖర్, తహసీల్దార్ ఎన్.శేఖర్ ఉన్నారు.

యువతి ఆత్మహత్య

- అయ్యకోనేరులో లభించిన మృతదేహం


రమ్య (ఫైల్)

విజయనగరం క్రైమ్: విజయనగరంలోని అయ్యకోనేరు చెరువులో శనివారం సాయంత్రం 6.30 గంటలకు టూటౌన్ పోలీసులు ఓ యువతి మృతదేహాన్ని గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని బాబామెట్టకు చెందిన బెహరా ఈశ్వరరావు దంపతులకు ఇద్దరు పిల్లలు. కొడుకు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుండగా, కూతురు రమ్య స్థానికంగా చదువుతోంది. ఈశ్వరరావు భార్య నగరంలోని మహారాణిపేటలో బీవీకే స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి సైకిల్‌పై వెళ్లిన రమ్య మరుసటి రోజు వరకు ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే అందుబాటులో లేదని వచ్చింది. దీంతో శనివారం ఉదయం తండ్రి బెహరా ఈశ్వరరావు టుటౌన్ పోలీసు స్టేషన్‌కు వచ్చి తన కూతురు కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. సాయంత్రం అయ్యేసరికి అయ్యకోనేరు చెరువులో మృతదేహం కనిపించింది. ఇంటి నుంచి వెళ్లిపోయిన రమ్యకు పెళ్లి చేసేందుకు కన్నవారు యత్నించారు. అయితే తనకు ఆ పెళ్లి ఇష్టంలేదని గడిచిన కొద్దిరోజుల నుంచి కన్నవారితో రమ్య గొడవపడుతూనే ఉంది. దీంతో ఎవరితో మాట్లాడకుండా ఉండడం, గదిలోకి వెళ్లి ఒంటరిగా ఉండడం వంటి పనులు చేయసాగింది. శుక్రవారం ఫ్రెండ్ దగ్గరకు వెళ్తానని చెప్పి సైకిల్ తీసుకుని వెళ్లి చివరకు తిరిగి రాని లోకాలకు వెళ్లి కన్నవారికి తీరని శోకాన్ని మిగిల్చింది. తొలుత మిస్సింగ్ కేసు నమోదు చేసినా మృతదేహం లభించడంతో బీఎన్ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.


పురుగు మందు తాగి యువతి మృతి


సంధ్య (ఫైల్)

సీతానగరం: మండలంలోని పెద భోగిలి-1 సచివాలయంలో ఎంఎల్‌హెచ్‌పీ గా ఉద్యోగం చేస్తున్న చింతాడ సంధ్య(25) విశాఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. పెదంకలాం గ్రామానికి చెందిన చింతాడ సంధ్య ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తోంది. సంధ్యకు వివాహం చేయాలన్న సంకల్పంతో వివాహానికి సంబంధించిన చర్యలు ఇంట్లో రావడంతో తాను పెళ్లిచేసు కోనని ఆమె నిరాకరించగా కుటుంబంలో వచ్చిన మనస్పర్ధలతో మనస్తాపం చెంది సంధ్య అక్టోబరు 7వ తేదీన సీతానగరం రైల్వే గేటువద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యసేవల నిమిత్తం విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తల్లి చింతాడ మరియమ్మ (మీరమ్మ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు.

చేపల దొంగలపై చర్యలు తీసుకోవాలి

- జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు బర్రి చిన్నప్పన్న


గంట్యాడ పోలీస్ స్టేషన్ ఎదుట మాట్లాడుతున్న బర్రి చిన్నప్పన్న

గంట్యాడ: మండలంలోని పెంట శ్రీరాంపురం గ్రామంలోని నల్ల చెరువులో దొంగతనంగా చేపలు పట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు బర్రి చిన్నప్పన్న డిమాండ్ చేశారు. పెంట శ్రీరాం పురం గ్రామంలో అక్కివరం, గొడ్డు పాలెం గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులు చేపలు పడుతుండగా గ్రామానికి చెందిన మత్స్యకార సహకార సంఘం సభ్యులు పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. దొంగతనంగా చేపలు పట్టిన వారిపై కేసు నమోదు చేయడంలో పోలీసులు జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే వారిపై కేసులు నమోదు చేయాలని లేని ఎడల మత్స్యకార సహకార సంఘాల నాయకులం రోడ్డెక్కి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. చెరువుల్లో దొంగతనంగా చేపలు పడుతున్న విషయంపై గత నెలలో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినప్పటికీ సరైన చర్యలు తీసుకోక పోవడం వల్ల మత్స్యకారులకు చెందిన చేపలు చోరీకి గురై ఆర్థికంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్యవిద్యా వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి

- ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే చెల్లించాలి
- పౌరవేదిక సంఘం డిమాండ్


రౌండ్ టేబుల్ సమావేశం వాల్‌పోస్టర్‌ను విడుదల చేసిన రెడ్డి శంకరరావు, సభ్యులు

విజయనగరం గంటస్తంభం: పేదలకు అందుబాటులో వైద్యవిద్య అందాలంటే వైద్యవిద్య. ప్రజారోగ్య వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎల్బీజీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్యరంగాన్ని పీపీపీ మోడల్‌లో ప్రైవేట్ చేతుల్లోకి అప్పగించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇది ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నమన్నారు. గత ప్రభుత్వం కేంద్ర నిధులతో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయగా, అందులో ఐదు ఇప్పటికే ప్రారంభమైనట్లు గుర్తుచేశారు. ఇప్పుడు ఆ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలనుకోవడం పేద విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ చేతుల్లోకి వెళ్తే వైద్యవిద్య పేదలకు అందని ద్రాక్ష అవుతుంది. ఫీజులు భారీగా పెరిగి పేద విద్యార్థులు వెనుకబడిపోతారు. అదేవిధంగా వైద్యం కూడా మరింత ఖరీదుగా మారుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

పీహెచ్‌సీ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల పేదలు చికిత్స అందక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వెంటనే ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీ వైద్యులు తమ సమస్యల పరిష్కారం కోసం 20 రోజులుగా సమ్మెలో ఉన్నారని, వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రజారోగ్య వ్యవస్థ నిర్వీర్యమవుతోందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని కోరారు. ఈనెల 15తేదీన విజయనగరంలో జరగనున్న రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో యూఎస్.రవికుమార్, సుధీర్, సతీష్ పాల్గొన్నారు.

480 మద్యం బాటిల్స్ పట్టివేత

- పోలీసుల అదుపులో బెల్టు షాపు నిర్వాహకుడు


గేట్లు ఎత్తేశారు

బెల్టుషాపులపై సాక్షిలో వచ్చిన కథనం

గంట్యాడ: గ్రామాల్లో బెల్టు షాపుల విషయంలో సాక్షి చెప్పిందే నిజమైంది. గంట్యాడ మండలంలోని నీలావతి గ్రామంలో శుక్రవారం రాత్రి పెద్ద ఎత్తున మద్యం పట్టుబడింది. ఒకే బెల్టుషాపు నిర్వాహకుడి దగ్గర ఏకంగా 480 సీసాలను. రూ.31,640 పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలో మద్యం ఏరులై పారుతోందనే విషయాన్ని సాక్షి ఇటీవల ప్రచురించిన కథనం ద్వారా వెలుగులోకి తెచ్చింది. ఈ గ్రామంలో బెల్టుషాపు నిర్వహణ నిమిత్తం వేలంపాట నిర్వహించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేలంపాట దక్కించుకున్న బెల్టుషాపు నిర్వాహకుడు సియ్యాదుల గౌరీబాబును శనివారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై డి.సాయికృష్ణ తెలిపారు. మండలంలో మద్యం ఏరులై పారుతోంది. సందుసందుకు ఒక బెల్టుషాపు వెలిసింది. అధికార పార్టీ నేతల అండదండలతో బెల్టుషాపులు గణనీయంగా పెరిగినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి గ్రామంలో 40 నుంచి 50 వరకు బెల్టుషాపులు వెలిశాయి. వాటిని అరికట్టే నాథుడే లేక పోవడం వల్ల మద్యం విచ్చలవిడిగా దొరుకుతోంది.

చీపురుపల్లిలో భారీ చోరీ

- 10 తులాల బంగారం, కేజీన్నర వెండి, రూ.2.5 లక్షలు నగదు అపహరణ
- బాధితుడి ఫిర్యాదుపై పోలీసుల దర్యాప్తు


బెడ్ రూమ్‌లో దొంగలు తెరిచిన బీరువాలు


ఆధారాలు సేకరిస్తున్న డాగ్ స్క్వాడ్


దొంగలు తొలగించిన కిటికీ గ్రిల్

చీపురుపల్లి: పట్టణంలో జరుగుతున్న వరుస దొంగతనాలు అలజడి సృష్టిస్తున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మెయిన్ రోడ్‌లో ఇద్దరు వృద్ధులను గాయపరిచి భారీ మొత్తంలో బంగారం దోచుకెళ్లిన ఘటన జరిగిన కొద్ది రోజుల్లోనే పట్టణంలోని ఆంజనేయపురంలోని విజయకృష్ణ అపార్ట్‌మెంట్ రోడ్‌లో నివాసం ఉంటున్న ఒమ్మి సురేష్ అనే ఉపాధ్యాయుడి ఇంటిలో శుక్రవారం రాత్రి భారీ చోరీ జరగడం స్థానికంగా ఉలిక్కపడేలా చేసింది. ఈ ఘటనలో 10 తులాల బంగారం, కేజీన్నర వెండి, రూ.2.5 లక్షలు నగదు పోయినట్లు ఉపాధ్యాయుడు సురేష్ తెలిపారు. దొంగలు ఇంటిలోని రెండు బెడ్ రూమ్‌లలో ఉన్న బీరువాలు, కప్‌బోర్డులు మొత్తం వెతికి, సామగ్రి చిందర వందరగా పడేశారు. బీరువాల్లో చీరలు, బట్టలు ఉన్నప్పటికీ వాటిని ముట్టుకోకుండా బంగారం, వెండి, నగదుపైనే దుండగులు దృష్టి సారించారు. ఇదే ఇంటికి పక్కనే ఉన్న విజయకృష్ణ అపార్ట్‌మెంట్‌లో రెండేళ్ల క్రితం గంగాధర్ నివాసంలో పడిన దొంగలు 25 తులాల బంగారం అపహరించుకుపోయారు. మళ్లీ అక్కడే పక్క ఇంటిలో చోరీ జరగడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

కిటికీ గ్రిల్ తొలగించి ఇంట్లోకి ప్రవేశించి

కిటికి గ్రిల్ తొలగించి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు పొడవాటి స్క్రూడ్రైవర్, మూడు అడుగుల రాడ్డుతో ఇంట్లో ఉన్న బీరువాలను తెరిచారు. బీరువాల్లో లాకర్లు తెరిచి 10 తులాల బంగారం, కేజీన్నర వెండి, రూ.2.5 లక్షలు నగదు దోచుకెళ్లారు. అయితే చోరీకి తీసుకొచ్చిన స్క్రూ డ్రైవర్, రాడ్డు బెడ్ రూమ్‌లోని మంచంపైనే వదిలి పెట్టి వెళ్లిపోయారు.

పెళ్లికి వెళ్లి వచ్చిన బాధితులు

ఉపాధ్యాయుడు సురేష్ భార్యతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం రాజాం పట్టణానికి ఓ వివాహ వేడుకకు వెళ్లారు. వేడుక ముగించుకుని తిరిగి రాత్రి 1.30గంటల సమయంలో ఇంటికి చేరుకున్నారు. ఇంటి ముఖద్వారం తాళం తెరిచి లోపలికి వెళ్లి ప్రధాన హాలు తలుపు తీసేందుకు ప్రయత్నించగా రావడం లేదు. లోపల గడియ పెట్టి ఉండడాన్ని గమనించి ఇంట్లో దొంగలు పడినట్లు గుర్తించారు. తెలిసిన వారికి ఫోన్‌లు చేసి రప్పించి పోలీసులకు సమాచారం ఇస్తున్న సమయంలో ఇంటి లోపల ఉన్న దొంగలు వెనుక డోర్ నుంచి పారిపోయారు.


ఆధారాల సేకరణ

విషయం తెలుసుకున్న క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించాయి. చోరీకి వినియోగించిన పరికరాలు, కిటికీ గ్రిల్‌పై వేలిముద్రలు సేకరించారు. బాధితుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి రైల్వేస్టేషన్ సమీపంలో గరివిడి పట్టణంలో రైలు ఢీకొన్న సంఘటనలో గుర్తు తెలియని వృద్ధుడు శనివారం మృతిచెందాడు. విశాఖపట్నం నుంచి పలాస వైపు సాయంత్రం 5 నుంచి 6 గంటల సమయంలో వెళ్తున్న రైలు ఢీకొనడంతో 70 ఏళ్ల వయస్సు గల వృద్ధుడు మృతిచెందాడు.

పశుబీమాపై నీలినీడలు!


పూసపాటిరేగలో పశువులు

- జూలై నుంచి అమలుకాని పశుబీమా
- ప్రమాదవశాత్తూ పశువులు మరణిస్తే పైసా కూడా అందని వైనం
- ఆందోళనలో పాడి రైతులు

పూసపాటిరేగ: పాడి పశువులు ఆపదలో పడినప్పుడు రైతుకు అండగా నిలిచే పశుబీమాపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత నాలుగు నెలలుగా పశుబీమా పథకం అందక పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యాధులబారిన పడి పశువులు మృత్యువాత పడుతున్నా బీమా అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పశుబీమా పథకం పక్కాగా అమలయ్యేది. పాడిపశువు మృతి చెందితే రూ.15వేల నుంచి రూ.40వేల వరకు బీమా అందేది. నేడు ఓ వైపు పాలధర తగ్గడం, మరోవైపు పాడి పశువులు మృతిచెందితే బీమా అందకపోవడం వంటివి పాడిరైతును కుంగదీస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి పశుబీమా పథకం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పాడిరైతులు కోరుతున్నారు.

బీమా పునరుద్ధరించాలి

పాడి రైతులకు తక్షణమే పశుబీమా పునరుద్ధరించాలి. గతంలో పాడిరైతులకు ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించి ఆదుకొనేది. పశువులు వ్యాధులు బారిన పడి మృత్యువాత పడితే బీమా డబ్బులు అందేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వం స్పందించి పశుబీమాను పునరుద్ధరించాలి.

– ఎం.రామునాయుడు, రైతు, పతివాడ